

వినియోగదారుడా మేలుకో..
వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం 1986 నుంచి ప్రత్యేక చట్టాన్ని అమలు చేస్తోంది.
- 8లో



శాశ్వత మరమ్మతులు జరిగేనా!
వరుసగా ఏడు సంవత్సరాలుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతులకు నోచుకోవడం లేదు.
- 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-31 (శనివారం సా॥)
సహర్ 5-02 (ఆదివారం ఉ॥)

న్యూస్‌రీల్

ఏప్రిల్ 20నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

భువనగిరి : సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 20వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి కి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 26 నుంచి మే 3వ తేదీ వరకు సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని శుక్రవారం సబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

టెన్త్ ప్రశ్న పత్రాలు నేడు మండలాలకు చేరవేత

భువనగిరి : పదో తరగతి పరీక్షలకు సంబంధించి సెట్ వన్ ప్రశ్న పత్రాలు శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరాయి. వీటిని శనివారం మండల కేంద్రాలకు తరలించనున్నట్లు డీఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం 8,631 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేత్రపర్వం.. ఊంజల్ సేవోత్సవం


ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఊంజల్ సేవోత్సవం పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. సాయంత్రం వేళ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారిని అధిష్టింపజేసి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఆండాళ్‌దేవికి ఇష్టమైన నాద స్వరాన్ని వినిపించారు. ఇక ప్రధానాలయంలోనూ సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలో స్వయంభూలు, ప్రతిష్టా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. అనంతరం సుదర్శన హక్షమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూజలు నిర్వహించారు.

రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలి

భూదాన్‌పోచంపల్లి : రైతుల మాదిరిగానే చేనేత కార్మికులకు కూడా రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేయాలని చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కర్నాటి పురుషోత్తం ప్రభుత్వాన్ని కోరారు. చేనేత కార్మికుల్లోనూ చాలా మంది నిరుపేదలు ఉన్నారని, నేత వృత్తిపైనే వారి కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. నేసిన వస్త్రాలకు గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రుణాలు చెల్లించలేకపోతున్నారని, వడ్డీలు పెరిగిపోయినట్లు తెలిపారు. చాలా మంది కార్మికులు రూ.లక్షకు పైగా బకాయి పడ్డారని వారందరికీ రూ.2లక్షల లోపు మాఫీ చేయాలని పేర్కొన్నారు. రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేసినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు ఆర్థిక భారం నుంచి విముక్తి లభించనుందన్నారు.

ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించాలి

నాగారం: రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు విద్యాబోధన చేస్తున్న ఐఈఆర్పీ(ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లను సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా రెగ్యులరైజ్ చేయాలని ఐఈఆర్పీల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2023–24 లెక్కల ప్రకారం 81వేల మంది దివ్యాంగ పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో నమోదై ఉన్నారని, వీరికి 790 మంది ఉపాధ్యాయులు 19 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు.

రంగుల పండుగ.. ఆనందం నిండుగ


హోలి సందర్భంగా శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలో రంగులు చల్లుకుని కేరింతలు కొడుతున్న యువకులు



సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రంలో హోలి ఆడుతున్న చిన్నారులు, యువత


తుర్కపల్లి మండలం బిల్యానాయక్‌తండాలో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కృత్రిమ మేధతో బోధన

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నేటి నుంచి అమలు

- జిల్లాలోని ఏడు మండలాల్లో తొమ్మిది పాఠశాలలు ఎంపిక
- చదువులో వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక తరగతులు
- ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం కొత్త కార్యక్రమం
- ఇప్పటికే టీచర్లకు శిక్షణ పూర్తి



భువనగిరి: సర్కారు బడుల్లో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కృత్రిమ మేధ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ) సాయంతో విద్యార్థులను ఆకట్టుకునేలా, సులభ రీతిలో వినూత్న బోధన చేయనుంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో శనివారం నుంచి పాఠ్యాంశాలు బోధించనున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 7 మండలాల నుంచి 9 పాఠశాలలు ఎంపికయ్యాయి. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో మెరుగైన ఫలితాలు రావడంతో ఏఐ విధానాన్ని మిగతా అన్ని జిల్లాల్లోనూ అమలు చేయాలని విద్యా శాఖ నిర్ణయించింది.

నిపుణులైన ఉపాధ్యాయులకు శిక్షణ

ఏఐ బోధనకు ప్రతి జిల్లాలోనూ కొన్ని పాఠశాలలను గుర్తించి ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో బోధించేందుకు నిపుణులైన ఉపాధ్యాయులు, జిల్లా సమన్వయ అధికారులకు ఈనెల 11న రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కాగా జిల్లా కేంద్రంలో ఈనెల 12న సంబంధిత ఎంఈఓలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, పాఠశాల ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఏఐ బోధనపై శిక్షణ కూడా ఇచ్చారు. ఎంపికైన పాఠశాలల్లో శనివారం నుంచి ఏఐ బోధన ప్రారంభంకానుంది.

మెరుగైన సామర్థ్యాల సాధనకు..

ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో మౌలిక భాష, సంఖ్యా జ్ఞానం అభ్యసనతోపాటు గణితంలో చతుర్విద ప్రక్రియల్లోనూ ఆశించిన స్థాయి సామర్థ్యాలు సాధించకపోవడంతో విద్యలో వెనుకబాటుకు గురవుతున్నారు. పలు రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేధ సాయంతో 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల సాధనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారు.

20 నిమిషాల వ్యవధిలో పాఠం

ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో విద్యార్థులను ఆకట్టుకునేలా ఏఐ బోధన అందిస్తారు. ఎంపిక చేసిన 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను అయిదుగురికి ఒక బ్యాచ్ ఏర్పాటు చేస్తారు. ఒక్కో బ్యాచ్‌కు తెలుగు వాచకం, గణిత అభ్యాసాలపై 20 నిమిషాల వ్యవధిలో ఏఐ పాఠాలు బోధిస్తారు. ఆ విద్యార్థి అర్థం చేసుకుంటున్నాడా, లేదా అని ఏఐ గుర్తించి అర్థం కాకపోతే సరళమైన మార్గంలో బోధిస్తుంది. అర్థం అయ్యిందంటే మరికొంత మెరుగైన పద్ధతిలో బోధన అందిస్తుంది. ఇలా ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను మదింపు చేయడంతో పాటు, గతంతో పోలిస్తే పురోగతి ఎలా ఉందో పరిశీలించి ఆయా విద్యార్థులపై ఒక నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తారు.

చదవడం, రాయడం సులభంగా అలవడుతుంది

చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ బోధన ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణంగా పాఠశాలలో మూడు రకాల విద్యార్థులు ఉంటారు. ఇందులో మూడో రకం విద్యార్థులకు తరగతి గదిలో ఉపాధ్యాయుడు చేసే బోధనకు అదనంగా ఏఐ బోధన ఉంటుంది. దీని వల్ల విద్యార్థికి చదవడం, రాయడం సులభంగా అలవడుతుంది. కంప్యూటర్ స్క్రీన్‌పై ఏఐ బోధన రోజూ 20 నిమిషాలు ఉంటుంది.
–సత్యనారాయణ, డీఈఓ


శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ సత్యనారాయణ

ఎంపికైన పాఠశాలలు ఇవీ..

ఆర్టిఫీషియల్ ఇంటిలెజెన్స్ బోధనకు యాదాద్రి భువనగిరి జిల్లాలో తొమ్మిది ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో చౌటుప్పల్ మండలంలోని జైకేసారం, దేవలమ్మనాగారం, యాదగిరిగుట్ట మండలంలో పెద్దకందుకూరు, చొల్లేరు, ఆలేరు మండలంలో కొల్లూరు, మోటకొండూరు మండలంలో ముత్తిరెడ్డిగూడెం, భువనగిరి మండలంలో తుక్కాపురం, బీబీనగర్ మండలంలో జమిలాపేట, రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం పాఠశాలలు ఉన్నాయి.

కొనేదాంట్లో కొట్టేస్తున్నారు!

వస్తు విక్రయాల్లో మోసం
- వేయింగ్ మిషన్లలో తేడాలు
- నాణ్యతకూ తిలోదకాలు
- కనిపించని కల్తీతో ప్రజారోగ్యానికి ముప్పు
- తనిఖీలకు దూరంగా అధికారులు
- వినియోగదారులకు ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియని దుస్థితి
- నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం



భువనగిరి పట్టణంలో కొందరు వ్యక్తులు మొబైల్ వాహనంపై ఉల్లిగడ్డ కొనుగోలు చేశారు. అనుమానం రావడంతో వేరే షాప్‌కు వెళ్లి కాంటా వేశారు. ఐదు కిలోల బ్యాగులో 200 గ్రాములు, పది కిలోల బస్తాలో 500 గ్రాముల వరకు తక్కువ వచ్చింది. వ్యాపారి కోసం చూడగా అప్పటికే అతను అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఎర్ర ఉల్లిగడ్డ కిలో రూ.35, తెల్ల ఉల్లిగడ్డ రూ. 30 ఉంది.

మోటకొండూరుకు చెందిన లోడే పుష్పమ్మ భువనగిరిలోని ఓ బంగారం షాపులో 24 క్యారెట్‌ల బిస్కెట్ బంగారం కొనుగోలు చేసింది. స్వగ్రామంలోని స్వర్ణకారుని వద్ద చెవి కమ్మలు చేయించుకుంది. ఆ తరువాత మరో స్వర్ణకారుడి వద్ద పాత కమ్మలనే కొత్త డిజైన్‌తో తయారు చేయించుకుంది. కొంతకాలం తరువాత బంగారం కొనుగోలు చేయడానికి హైదరాబాద్‌లోని ఓ జ్యువెలరీ షోరూమ్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. చెవి కమ్మలను తూకం వేయించగా 18 క్యారెట్‌లే ఉంది.

సాక్షి యాదాద్రి : తూకంలో మోసం, నాసిరకం సరుకుల విక్రయం, కల్తీ, అధిక ధరలు.. ఇలా లాభార్జనే ధ్యేయంగా వ్యాపారలావాదేవీలు జరుగుతున్నాయి. కాయగూరలు మొదలుకొని ప్యాకేజీసీడ్స్, నిత్యావసర సరుకులు, పాలు, బంగారం వరకు నిత్యం ఏదో ఒక రూపంలో వినియోగదారుడు వంచనకు గురవుతున్నాడు. ఇలా మోసపోయే వినియోగదారులకు రక్షణగా నిలిచేందుకు వినియోగదారుల పరిరక్షణ చట్టం ఉన్నా దానిపై అవగాహన కల్పించకపోవడంతో ఆశించిన ప్రయోజనం కలగడం లేదు. దీంతో వినియోగదారుడు మోసపోయిన సందర్భాల్లో ఎవరికి, ఎక్కడ ఫిర్యాదు చేయాలో కూడా తెలియడం లేదు.

కల్తీమయం, నాసిరకం

నూనెలు, కారం, అల్లం ఎల్లిగడ్డ పేస్ట్, దనియాల పొడి, టీపొడర్‌తో పాటు ప్రతి ఒక్కరూ వినియోగించే పాలు సైతం కల్తీమయంగా మారాయి. దానికితోడు హోటళ్లు, బేకరీలు, టిఫిన్‌సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు నాణ్యతను పట్టించుకోవడం లేదు. కల్తీ కిరాణ షాపులు, సూపర్ మార్కెట్‌లు, బేకరీలు తదితర వ్యాపార సముదాయాల్లో విక్రయిస్తున్న ప్యాకేజ్ గూడ్స్‌పై ఎమ్మార్పీ రేటు, తయారీ, ఎక్స్‌పైరీ తేదీలు, బరువు వివరాలు ముద్రించి ఉండాలి. కానీ, చాలా చోట్ల అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆహారపదార్థాలు విషపూరితంగా మారి ప్రజారోగ్యం ప్రమాదం పడుతోంది. వినియోగదారులు ఆర్థికంగానూ నష్టపోతున్నారు. ఇక తూకాలగంజ్ మార్కెట్, రైతు బజార్, రోడ్డుపక్కన పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులు అమ్మే వారు తూకాల్లో మోసం చేస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాల్లో తూకం సెట్ చేసి పెడుతన్నారు. చాల చోట్ల ఇనుప బాట్లనే వాడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు దుకాణాల్లో బోర్డులపై ఎక్కడా రాయడంలేదు.

కళ్లెదుటే తూకంలో మోసం

జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల దుకాణాలు సుమారు 5వేల వరకు ఉంటాయి. రోజూ రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. పండ్లు, కూరగాయల నుంచి నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ పరికరాల వరకు విక్రయిస్తుంటారు. వీటిలో వినియోగదారులు ఎక్కువగా మోసాలకు గురవుతున్నారు. తూకం విషయంలో కొందరు నిబంధనలు పాటించడం లేదు. చాలా చోట్ల పాతకాలం నాటి బాట్లు, కాంటాలనే వాడుతున్నారు. ఇక ఎలక్ట్రానిక్స్ కాంటాలున్న వారు తమకు లబ్ధి చేకూరేలా సెట్ చేసి పెడుతున్నారు. అరికట్టాల్సిన అధికారులు తనిఖీలనే మరిచారు. ఫిర్యాదులు వస్తే తప్ప కార్యాలయం నుంచి కాలు బయటపెట్టకుండా రూ.వేలలో అదనపు ఆదాయానికి అలవాటు పడి ప్రజారోగ్యాన్ని విస్మరించారు.


భువనగిరిలోని రైతుబజార్‌లో పాతకాలం నాటి ఇనుపబాట్లు వేసి తూకం వేస్తున్న దృశ్యం

జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటు చేయాలి



పండ్లు, నిత్యావసరాలు మొదలుకొని బంగారం వరకు వినియోగదారులు మోసపోతున్నారు. నిత్యం తాగే పాలు సైతం కల్తీ జరుగుతున్నాయి. నాసిరకం ఆహారపదార్థాలు తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఫుడ్ సేఫ్టీతో పాటు డ్రగ్ ఇన్స్‌పెక్టర్, తూనికలు కొలతల శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తుండాలి. వినియోగదారుల పరిరక్షణ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. భువనగిరిలో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఏర్పాటు చేయాలి.
–కొడారి వెంకటేశ్, వినియోగదారుల సంఘం ప్రతినిధి

ఇటీవల వెలుగు చూసినవి..

- భువనగిరిలోని ఓ బంక్‌లో పోస్తున్నది పవర్ పెట్రోలా, సాధారణ పెట్రోలా వినియోగదారులకు తెలియడం లేదు. బంకుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా నిర్వాహకులు అవేమీ పట్టించుకోవడం లేదు. బస్వాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వాహనంలో పెట్రోల్ పోయించకుని బిల్లు అడగగా సరైన సమాధానం చెప్పకుండా పవర్ పెట్రోల్ ధర వసూలు చేశారని ఆరోపించాడు.
- భువనగిరి ఆర్టీసీ బస్టాండ్‌లో శ్రీనాథ్ అనే ప్రయాణికుడు వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. బాటిల్‌పై ఎంఆర్‌పీ రేటు రూ.25 ఉండగా వ్యాపారి రూ.20 తీసుకున్నాడు. కూల్‌డ్రింక్స్‌పైనే అదనంగా 5 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు.

నేటి నుంచి ఒంటి పూట బడులు

- ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- టెన్త్ పరీక్ష కేంద్రాలున్న పాఠశాలల్లో ఒంటి గంట నుంచి సాయంత్రం 5 వరకు తరగతులు

భువనగిరి : ఒంటిపూట బడులు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1నుంచి 9వ తరగతి వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందజేయనున్నారు. అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపిస్తారు. ప్రభుత్వ, ఎయిడెడ్‌తో పాటు అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలు ఒంటిపూట బడులు అమలు చేయాలని, విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని అధికారులు స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్ష కేంద్రాలున్న స్కూళ్లలో మార్పులు

పదో తరగతి పరీక్షలు ఈనెల 21నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన పాఠశాలల్లో ఒంటి పూట బడుల వేళల్లో మార్పులు చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. 50 చోట్ల పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇందులో 19 ప్రైవేటు, 31 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులు ఒంటి గంటకు ముందుగానే పాఠశాలలకు చేరుకుని మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం తరగతులకు హాజరవుతారు.

పాఠశాలలు, విద్యార్థులు

జిల్లా వ్యాప్తంగా 715 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 484 ప్రాథమిక, 163 ప్రాథమికోన్నత, 68 జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 39,758 మంది విద్యార్థులు ఉన్నారు. వీటితో పాటు 151 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో 40వేలకు పైగా విద్యార్థులున్నారు. 2024–25 విద్యా సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీతో ముగియనుంది.

అన్ని యాజమాన్యాలకు వర్తింపు

ప్రభుత్వ, ఎయిడెడ్‌తో పాటు అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల యాజమాన్యాలకు ఒంటి పూట బడులు వర్తిస్తాయి. నిర్దేశిత వేళల్లోనే ఒంటిపూట బడులు నిర్వహించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యథావిధిగా మధ్యాహ్నం భోజనం అందజేస్తాం. విద్యార్థులు బడినుంచి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రుల కళ్లుగప్పి బయటకు వెళ్లే అవకాశం ఉంటుంది. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. బయట తిరగనీయొద్దు.
–సత్యనారాయణ, డీఈఓ

యాదగిరి క్షేత్రంలో ఘనంగా హోలి సేవ


శ్రీస్వామి,అమ్మవార్లకు హోలి సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం హోలి సేవ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా తీర్చిదిద్ది ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పడమటి రాజగోపురం ఎదుట గల వేంచేపు మండపంలో అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు చేసి, పారాయణం పఠించారు. ప్రధానార్చకులు హోలి సేవ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం ఉత్సవ మూర్తులపై రంగులు చల్లారు. ఆ తరువాత భక్తులు పరస్పరం రంగులు చల్లుకున్నారు. ఈ వేడుకలో ఆలయ అనువంశిక ధర్మకర్త, ఆచార్యులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ట్యాంకర్ నీళ్లే దిక్కు

యాదగిరిగుట్ట మండలం వంగపల్లికి చెందిన జోగు బాలరాజు రెండు ఎకరాల్లో వరి సాగు చేశాడు. రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టాడు. నాట్లు వేసే సమయంలో బోరు నిండుగా నీళ్లు పోసేది. పక్షం రోజులుగా ఎండలు ముదరడంతో భూగర్భ జలాలు అడగుంటాయి. దీంతో బోరు ఆగి పోస్తుండడంతో పంటకు సరిపడా నీరందడం లేదు. పొట్ట దశలో ఉన్న పొలాన్ని కాపాడుకునేందుకు 15 రోజులుగా ట్యాంకర్ ద్వారా నీరందిస్తున్నాడు. ట్యాంకర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఉదయం, సాయంత్రం తడులు అందిస్తున్నట్లు బాలరాజు తెలిపాడు.
–యాదగిరిగుట్ట రూరల్


ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన భువనగిరిలోని అంబేద్కర్ చౌరస్తా

నారాయణపురం @40.5

- పగటి ఉష్ణోగ్రతలు పైపైకి
- అన్ని మండలాల్లో 39 డిగ్రీలకు పైనే నమోదు

భువనగిరి టౌన్ : జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. సాధారణం కంటే మూడు, నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతుండడంతో పిల్లలు, వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. శుక్రవారం అన్ని మండలాల్లో 39 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలో 40.5 డిగ్రీలు కాగా, బొమ్మలరామారం 40.1, గుండాల 40, ఆత్మకూర్(ఎం) 39.9 డిగ్రీలు నమోదైంది. రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాను ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది. ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్న సమయంలో ప్రధాన వీధులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. అత్యవసరమైతే తప్ప.. బయటకు రావొద్దని, ఒకవేళ వచ్చినా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలి బలవన్మరణం

చిట్యాల: మండలంలోని వనిపాకల గ్రామంలో శుక్రవారం ఓ వృద్ధురాలు అనారోగ్య సమస్యలతో బలవన్మరణానికి పాల్పడింది. ఎస్‌ఐ ఎన్.ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. వనిపాకల గ్రామానికి చెందిన మల్లమ్మ(75) కొంత కాలంగా కాన్సర్‌తో బాధపడుతోంది. ఇటీవల ఆమె ఆరోగ్యం మరింతగా క్షీణించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గుర్తించిన కుటుంబసభ్యులు ఆమెను నల్లగొండలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

చౌటుప్పల్ రూరల్: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముఠాను ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని అనకాపల్లి జిల్లా నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తుండగా.. సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం సాయంత్రం చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వస్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా 22 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు ఐదుగురిని అదుపులోకి తీసుకుని చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తులు హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం. వారి నుంచి గంజాయి, రెండు కార్లను సీజ్ చేశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

చౌటుప్పల్ రూరల్: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ పరిధిలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామానికి చెందిన చెంచల అశోక్ 8 సంవత్సరాలుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలో నివాసముంటూ భవన కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రీన్‌ఇండస్ట్రియల్ పార్క్‌లో మేస్త్రీ పని ముగించుకుని గురువారం సాయంత్రం ఇంటికి వెళ్తున్నాడు. పార్క్ గేట్ వద్ద ఉన్న గోడకు బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో అతని తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చల్లా యాదవరెడ్డి తెలిపారు.

కిరాణ దుకాణంలో చోరీ

గుండాల: మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో కత్తుల లింగమ్మకు చెందిన కిరాణ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గురువారం రాత్రి షాపు బంద్ చేసి ఇంట్లో నిద్రపోయింది. శుక్రవారం ఉదయం షాపు తాళం పగులకొట్టి ఉండడం తోపాటు దుకాణంలో ఉన్న రూ.2 వేల నగదు అపహరణకు గురయ్యాయని పేర్కొంది. ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న షాపులో చొరబడి నగదు చోరీ చేశారని విలపించింది.

నల్లగొండకు చెందిన వి.మాధవి పట్టణంలోని ఎలక్ట్రానిక్ షోరూంలో 2021లో రూ.24,600కు ఫ్రిజ్ కొనుగోలు చేసింది. కొన్న మూడు నెలలకే కూలింగ్ సమస్య వచ్చింది. షాపు వద్దకు వెళ్లి అడిగితే సర్వీస్ సెంటర్‌కు పంపించారు. ఆన్‌లైన్‌లో కాల్ చేసి కంపెనీ వారికి చెబితే ఫ్రీగా చేస్తామని చెప్పినా సర్వీస్ సెంటర్ వద్దకు ఫ్రిజ్ తీసుకెళ్తే వారు డబ్బులు అడిగారు. దీంతో 2024లో నల్లగొండ జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. 9 శాతం వడ్డీతో ఫ్రిజ్ ధర రూ. 24,600, ఖర్చు రూ. 15,000 నష్టపరిహారం ఇప్పించారు.

పెద్దఅడిశర్లపల్లికి చెందిన ఆడెపు అంజనేయులు ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో ఇంటిని మార్టిగేజ్ చేసి 2023లో రూ.3లక్షల లోన్ తీసుకున్నాడు. ఫైనాన్స్ కంపెనీ వారు ఇన్సూరెన్స్ చేయించారు. ఇన్సూరెన్స్, డాక్యుమెంట్ ఖర్చులు పోను రూ. 2.77 లక్షల డబ్బులు ఇచ్చారు. లోన్ తీసుకున్న నెలకు అంజనేయులు మృతి చెందాడు. మృతి చెందిన మూడు నెలల వరకు కుటుంబ సభ్యుల నుంచి ఫైనాన్స్ కంపెనీ వారు ఈఎంఐ డబ్బులు వసూలు చేశారు. మృతుడి భార్య సరిత జిల్లా వినియోగదారులు కమిషన్ ఆశ్రయించింది. ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి బ్యాంకు ద్వారా తీసుకున్న లోన్ మొత్తంతో పాటు కోర్టు ఖర్చులు ఇప్పించింది.



నాగార్జునసాగర్ పైలాన్ కాలనీకి చెందిన కుక్కదాల బుచ్చయ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసి రిటైర్డ్ అయ్యాడు. కుడి కన్నుకు సమస్య రావడంతో 2021 హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకున్నాడు. వైద్యులు సర్జరీ చేశారు. అయినప్పటికీ సమస్య పోలేదు. 2024లో మళ్లీ కంటికి సర్జరీ చేశారు. ఈసారి ఆరోగ్యం విషమించింది. మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించారు. కుడి కంటికి చేసిన సర్జరీ విఫలమైందని దాని వల్ల ఎడమ కంటికి కూడా ఇన్‌ఫెక్షన్ వస్తుందని చెప్పారు. అదే ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అనంతరం జిల్లా వినియోగదారుల కమిషన్‌లో మొదట చూయించుకున్న ఆస్పత్రిపై ఫిర్యాదు చేశాడు. అన్ని పరీలించిన తర్వాత వైద్యానికి అయిన రూ. లక్ష, మెడిసిన్‌కు రూ.30 వేలు, కోర్టు ఖర్చులు రూ.50 వేలు పొందాడు.

వినియోగదారుడా మేలుకో..

వస్తువుల కల్తీ, నాణ్యతలేమి సమస్యల పరిష్కారానికి రాజదండంలా వినియోగదారుల రక్షణ చట్టం

- ఈ- కామర్స్ అనుచిత వ్యాపార విధానాల కట్టడికి ఈ చట్టంలో నిబంధనల రూపకల్పన
- తప్పుదారి పట్టించే ప్రకటనలు వెలువరించిన తయారీదారులు, అమ్మకందారులకు జరిమానా
- నేడు జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం



రామగిరి(నల్లగొండ): వినియోగదారుల వివాదాల పరిష్కారానికి భారత ప్రభుత్వం 1986లో వినియోగదారుల ఫోరం చట్టాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా వినియోగదారులకు వస్తు లోపం, సేవా లోపం తలెత్తితే ఈ చట్టం పరిష్కారం చూపుతుంది. ఈ సేవలు మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం వినియోగదారుల రక్షణ చట్టం-2019ను తీసుకువచ్చింది. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్లు, మధ్యవర్తిత్వం, ఉత్పత్తి బాధ్యత, తయారీదారులకు శిక్షలు, కల్తీ వస్తువుల అమ్మకం లాంటి విషయాల్లో అనేక నిబంధనలను ఈ చట్టంలో పొందుపరిచారు. ఇది వినియోగదారుల హక్కులను కాపాడటానికి, అమలు చేయడానికి పనిచేస్తుంది. హక్కుల ఉల్లంఘన జరిగినా, అనుచిత వ్యాపార విధానాలు అవలంబించినట్లు తెలిసినా, తప్పుదారి పట్టించే ప్రకటనలు వెలువరించినా.. వాటిపై దర్యాప్తు జరిపి వాటి తయారీదారులు, అమ్మకందారులు, ప్రకటనల ప్రచురణ, ప్రసారకర్తలకు జరిమానాలు విధిస్తుంది. మెడికల్, ఇన్సూరెన్స్, అగ్రిమెంట్, విద్యుత్ ప్రమాదాలు, నాసిరకం విత్తనాలు, చిట్ ఫండ్, ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయించినా, వస్తువుల నాణ్యత వంటి సమస్యలు తలెత్తినా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. ఈ-కామర్స్ వేదికల అనుచిత వ్యాపార విధానాలు అవలంబించకుండా అడ్డుకోవడానికి కూడా చట్టంలో నిబంధనలు పొందుపరిచారు.

పరిష్కారం సులభతరం

వినియోగదారుల వివాదాలను సులభంగా పరిష్కరించేందుకు కొత్త చట్టం ప్రాధాన్యమిచ్చింది. ఫిర్యాదులను ఆన్‌లైన్‌లోనూ దాఖలు చేయొచ్చు. వినియోగదారులు తన నివాస ప్రాంతంలోని కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయొచ్చు. ఒకవేళ ఫిర్యాదును 21 రోజుల్లోగా ఆమోదించినట్లు చెప్పకపోతే దానంతట అదే ఆమోదించబడినట్లుగా భావిస్తారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కూడా విచారణ జరుపుతారు. వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ నిబంధనల ప్రకారం రూ.5లక్షల లోపు కేసులు దాఖలు చేయడానికి ఎలాంటి రుసుము ఉండదు.

కేసుల వివరాలు (2020-2025)

సంవత్సరం	నమోదైన కేసులు	పరిష్కారమైనవి	పెండింగ్
2020	81	78	3
2021	107	100	7
2022	100	88	12
2023	124	80	44
2024	157	29	128
2025	13	-	13

వినియోగదారుల హక్కులు

- జీవితం మరియు ఆస్తికి ప్రమాదకరమైన వస్తువులు, ఉత్పత్తుల సేవల అమ్మకాల నుంచి వినియోగదారులు రక్షణ పొందే హక్కు.
- అన్యాయమైన వాణిజ్య పద్ధతుల నుంచి వినియోగదారుడిని రక్షించడానికి, వస్తువులు, ఉత్పత్తులు లేదా సేవల నాణ్యత, పరిమాణం, శక్తి, స్వచ్ఛత, ప్రామాణికం, ధరల గురించి తెలియజేసే హక్కు.
- భరోసా పొందే హక్కు
- వినడానికి, వినియోగదారుల ప్రయోజనాలకు తగిన వేదిక వద్ద తగిన పరిశీలన లభిస్తుందని హామీ ఇచ్చే హక్కు.
- నిర్బంధ వాణిజ్య పద్ధతులు లేదా వినియోగదారుల అనాలోచిత దోపిడీకి వ్యతిరేకంగా పరిష్కారాన్ని కోరే హక్కు.
- వినియోగదారుల అవగాహన హక్కు.

ప్రజల్లో చైతన్యం కలగాలి



వినియోగదారుల కమిషన్ చాలా శక్తివంతమైంది. చట్టంపై ప్రజల్లో చైతన్యం రావాలి. ఏ వస్తువైనా కొని నష్టపోతే తమను సంప్రదించవచ్చు. విమాన సేవలు, బ్యాంక్, బోర్డింగ్, కొరియర్, చిట్ ఫండ్, ఎడ్యుకేషన్ సంస్థలు, విద్యుత్ సమస్యలు, మెడికల్, ఇన్సూరెన్స్, గ్యాస్, పోస్టల్, రైల్వే, ఆర్టీసి, టెలిఫోన్, బోర్‌వెల్, కోల్డ్ స్టోరేజీ వీటిలో ఎలాంటి సమస్యలు కలిగినా వినియోగదారుల కమిషన్ సత్వర న్యాయం చేస్తుంది. జిల్లా వినియోగదారుల కమిషన్‌లో రూ.50 లక్షల వరకు ఫిర్యాదులు పరిష్కరించబడతాయి. ఆ పై రాష్ట్ర కమిషన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

– మామిడి క్రిష్టోఫర్, వినియోగదారుల కమిషన్ చైర్మన్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



వివరాలు సేకరిస్తున్న ఎస్సై

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్సై లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన సికిని యాదగిరి(59) గ్రామంలో బార్బర్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు భార్యలుండగా మొదటి భార్య చనిపోవడంతో మద్యానికి బానిస అయ్యాడు. గతంలో ఆమె హోళీ రోజే మృతిచెందడంతో ఆమెను గుర్తు చేసుకుని మనస్తాపం చెందిన యాదగిరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్ రూమ్‌లోని ఇనుప చువ్వకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానికులు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రెండవ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి 12గంటల సమయంలో ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడని సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి సుమారు 45సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. చామనఛాయ రంగు, ఎత్తు 5.7 అంగుళాలు, అతని దగ్గర లభ్యమైన ఓటర్‌కార్డుపై అమిత్‌పహాన్, వెస్ట్ బెంగాల్ అని ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎస్సై దూషించాడని మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణమ్మ

చివ్వెంల(సూర్యాపేట): ఎస్సై తనను అసభ్య పదజాలంతో దూషించాడని మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాల జానకిరాములు తన కుటుంబ సభ్యులతో కలిసి గత 50 సంవత్సరాలుగా కుడకుడ గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి పక్కన ఉన్న అతని బంధువులు వల్లాల రాములు, వల్లాల నరేష్, వల్లాల సురేష్, కొత్త సైదులు, కొత్త శైలజలకు గత కొంతకాలంగా ప్రహరీ విషయంలో వివాదం జరుగుతోంది. ఈ క్రమంలో ఈనెల 7న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలు ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో పోలీసులు పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని చెప్పారు. పెద్ద మనుషులు ఈనెల 15కు వాయిదా వేశారు. ఈక్రమంలో జానకిరాములు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అతడిని 13వ తేదీన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఆ సమయంలో భార్య రమణమ్మ మాత్రమే ఇంట్లో ఉంది. చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటి మధ్య ప్రహరీ కట్టిస్తుండగా, గమనించిన రమణమ్మ ఇంట్లోంచి బయటకు వచ్చింది. వాయిదా ఉండగా ఎందుకు గోడ కట్టిస్తున్నారని ప్రశ్నించింది. దీంతో ఎస్సై తనను అసభ్య పదజాలంతో దూషించాడని రమణమ్మ ఆరోపించింది. మనస్తాపంతో గుర్జై 14న ఇంట్లో ఉన్న స్లీపింగ్, యాంటి బయోటిక్, పెయిన్ కిల్లర్ మందులు వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన ఇంటి పక్కవారు ఆమెను సూర్యాపేటలోని ఆస్పత్రికి తరలించగా.. ప్రస్తుతం చికిత్స పొందుతోంది.

తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు

ఈ విషయంపై ఎస్‌ఐ మహేశ్వర్‌ను వివరణ కోరగా.. రమణమ్మ ఇంటి పక్కన ఉన్న కొత్త సైదులు.. తన ఇంటిపై వల్లాల శివరామకృష్ణ అనే వ్యక్తి వేట కొడవలితో దాడి చేసి భయాభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదు చేశాడని తెలిపారు. విచారణ కోసం వెళ్లి తిరిగి వచ్చానని, అక్కడ ఎవరిని ఏమి అనలేదని పేర్కొన్నారు. కావాలనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారని ఎస్‌ఐ తెలిపారు.

గ్రూప్స్‌లో మెరిశారు



సిలువేరు సురేష్

రామన్నపేట: రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన సిలువేరు సురేష్ శుక్రవారం విడుదలైన గ్రూపు- 3 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించాడు. అదే విధంగా ఈనెల 11న ప్రకటించిన గ్రూపు- 2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు పొందాడు. గతంలో గ్రూపు- 4 పరీక్షల్లో విజయం సాధించి ప్రస్తుతం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్- 1 సాధించడమే తన లక్ష్యమని సురేష్ పేర్కొంటున్నాడు.

గ్రూప్- 2, 3, 4 సాధించిన నారాయణపురం వాసి



బూర సతీష్

చిలుకూరు: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన బూర భిక్షం కుమారుడు సతీష్ ఇటీవల విడుదలైన గ్రూప్- 2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 206వ ర్యాంక్ సాధించాడు. తాజాగా విడుదలైన గ్రూప్- 3 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 318 ర్యాంక్ సాధించాడు. 2023లో రైల్వేలో జాబ్ వచ్చింది. ఆ ఉద్యోగానికి వెళ్లకుండా గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యాడు. కాగా.. 2024లో గ్రూప్- 4లో ఉద్యోగం సాధించి ప్రస్తుతం సూర్యాపేట కలెక్టరేట్‌లో సివిల్ సప్లయ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

పరీక్ష రాస్తే విజయమే



సాయికృష్ణారెడ్డి

మోత్కూరు: మోత్కూరుకు చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డి ఇటీవల విడుదలైన గ్రూప్- 1 ఫలితాల్లో 900 మార్కులకు గాను 446 మార్కులు సాధించాడు. గ్రూపు-2 ఫలితాల్లో స్టేట్ 11వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా గ్రూపు- 3 ఫలితాల్లో స్టేట్ 29వ ర్యాంకు సాధించాడు. గ్రూపు-4 ఫలితాల్లోనూ జిల్లా మొదటి ర్యాంకు సాధించాడు. సాయికృష్ణారెడ్డి వరుస విజయాల పట్ల ఆయన తల్లిదండ్రులు మోహన్‌రెడ్డి, స్వరాజ్యం, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పంచాయతీ కార్యదర్శిగా చేస్తూనే..



బాలకృష్ణ

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని అజ్మాపురం గ్రామానికి చెందిన గడిగ బాలకృష్ణ గ్రూప్- 3 ఫలితాల్లో 285 మార్కులతో 381వ ర్యాంకు సాధించాడు. గ్రూప్- 1లో 400 మార్కులు సాధించగా, గ్రూప్- 2లో 371 మార్కులతో 442వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

చిల్పకుంట్ల వాసికి 91వ ర్యాంకు



శ్యాంసుందర్‌రెడ్డి

నూతనకల్: గ్రూప్- 3 పరీక్ష ఫలితాల్లో నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన మందడి శ్యాంసుందర్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో 91వ ర్యాంకు సాధించాడు. అదేవిధంగా గ్రూప్- 2 పరీక్ష ఫలితాల్లో 400మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి 63వ ర్యాంకు సాధించాడు. గతంలో వీఆర్‌ఓ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం సూర్యాపేట సోషల్ వెల్ఫేర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు.

రెండు పరీక్షల్లోనూ కానిస్టేబుల్ ప్రతిభ



మంటిపల్లి శంకర్

గుర్రంపోడు: గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన మంటిపల్లి శంకర్ ఇటీవల విడుదలైన గ్రూప్- 2 ఫలితాల్లో 674 ర్యాంకు సాధించాడు. తాజాగా విడుదలైన గ్రూప్ - 3 ఫలితాల్లో 165 ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం సంస్థాన్ నారాయణపురం పోలీసు స్టేషన్‌లో సివిల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

గ్రూప్- 3లో స్టేట్ 211వ ర్యాంక్



సతీష్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ఆత్మకూరు మండలం గట్టిగల్లు గ్రామానికి చెందిన కోన లింగయ్య- పద్మల మొదటి కుమారుడు కోన సతీష్ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్ - 3 ఫలితాల్లో స్టేట్ 211 ర్యాంక్ సాధించాడు. గత ఎనిమిదేళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గ్రూప్స్‌కు సన్నద్ధమయ్యాడు. గత సెప్టెంబర్‌లో విడుదల చేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో సెలక్ట్ అయ్యాడు.

గ్రూప్- 2లో 427వ ర్యాంకు, గ్రూప్- 3లో 700 ర్యాంకు



అనూష

భువనగిరి: గ్రూప్- 3 ఫలితాల్లో భువనగిరి మండలం పెంచికల్‌పహాడ్ గ్రామానికి చెందిన అనూష రాష్ట్రస్థాయిలో 700వ ర్యాంకు సాధించింది. గ్రూప్- 2లో రాష్ట్ర స్థాయిలో 427వ ర్యాంకు సాధించగా.. జోన్‌లో ఉమెన్ విభాగంలో 4వ ర్యాంకు సాధించింది. గతంలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగానికి ఎంపిక కాగా అందులో చేరలేదు. గ్రూపు- 4లో ర్యాంకు సాధించి ప్రస్తుతం కలెక్టరేట్‌లోని రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తోంది.

యాదగిరి ఆలయ మాడవీధిలో జర్మనీ టెంట్



ఆలయ ఉత్తర మాడవీధిలో ఏర్పాటు చేసిన జర్మనీ టెంట్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ఉత్తర మాడ వీధిలో జర్మనీ టెంట్ ఏర్పాటు చేశారు. వేసవిలో శ్రీస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు నీడ కల్పించేందుకు ఈ టెంట్‌ను బిగించారు. గతేడాది వేసవిలో సైతం ఈ టెంట్‌ను ఏర్పాటు చేసి, భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కల్పించారు. ప్రస్తుతం ఎండలు మండుతుండటంతో భక్తులు ఆలయ మాడ వీధిలో నడిచేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆలయాధికారులు జర్మనీ టెంట్‌ను ఏర్పాటు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధం

వలిగొండ: షార్ట్‌సర్క్యూట్‌తో వస్త్ర దుకాణం దగ్ధమైన ఘటన వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో దొంత శ్యాంసుందర్‌కు చెందిన వస్త్ర దుకాణంలో శుక్రవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో పైరూములో ఉన్న పట్టు చీరలు, దుస్తులు కాలిపోయి దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. పక్క దుకాణ యజమానులు చూసి శ్యాంసుందర్‌కు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని విద్యుత్ సరఫరా ఆపివేసి మంటలు ఆర్పివేశారు. సుమారుగా రూ.3లక్షల విలువ గల దుస్తులు దగ్ధమైనట్లు దుకాణం యజమాని తెలిపారు.

ట్రాక్టర్, బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి: ట్రాక్టర్‌ను బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన గరిడేపల్లి మండల పరిధిలోని అప్పన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్లకు చెందిన పారేపల్లి శ్రీను, మహేందర్‌లు బైక్‌పై నేరేడుచర్ల నుంచి హుజూర్‌నగర్ వైపు వెళ్తుండగా ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108వాహనంలో హుజూర్‌నగర్‌కు తరలించారు. శ్రీను మామ బత్తిని లక్ష్మినర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొగిళ్లలో ఎలుగుబంటి కలకలం



గ్రామంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

చందంపేట: మండంలోని పొగిళ్ల గ్రామంలో గురువారం రాత్రి ఎలుగుబంటి సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు




డీసీఎంను ఢీకొట్టిన కారు

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్ వద్ద 65 నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం డీసీఎంను కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరుకు చెందిన వడ్లపూడి రవికిరణ్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం విజయవాడ నుంచి కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలో మండలంలోని ఉప్పలపహాడ్ బస్‌బే సమీపంలో యూటర్న్ తీసుకుంటున్న డీసీఎంను కారు వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారు నడుపుతున్న రవికిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ శివతేజ తెలిపారు.

శాశ్వత మరమ్మతులు జరిగేనా!

- సాగర్ స్పిల్‌వేకు ప్రతిసారి తాత్కాలిక పనులే చేస్తున్న ప్రభుత్వాలు
- శాశ్వత ప్రాతిపదికన మరమ్మతుల కోసం పలు సంస్థలతో అధ్యయనం
- ఈ యేడాది తాత్కాలిక మరమ్మతులకు కూడా ఇప్పటి వరకు కార్యాచరణ లేదు
- గత సంవత్సరం అత్యధిక వరదలతో స్పిల్‌వేపై మళ్లీ గుంతలు



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు స్పిల్‌వే మరమ్మతులు ఈ ఏడాది కూడా జరిగేలా లేవు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వరుసగా ఏడు సంవత్సరాలు మరమ్మతులకు నోచుకోలేదు. స్పిల్‌వేపై చాలా లోతుగా గుంతలు పడడంతో లోపలివైపు నుంచి నీటిజాలు రావడం మొదలైంది. 2014 నుంచి 2021 సంవత్సరం వరకు స్పిల్‌వే మరమ్మతులకు నోచుకోలేదు. స్పిల్‌వే మరమ్మతుల ఆవశ్యకతపై నిపుణుల హెచ్చరికల మేరకు 2022 సంవత్సరం జులైలో స్పిల్‌వే మరమ్మతు పనులకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఎట్టకేలకు 2023లో మరమ్మతులు చేశారు. ఆ సంవత్సరం వరదలు రాకపోవడంతో డిసెంబర్ వరకు పనులు కొనసాగాయి. అయితే, 2024లో సాగర్ ప్రాజెక్టుకు వరద ఎక్కువ రావడంతో అత్యధిక రోజులు గేట్లు ఎత్తారు. దీంతో స్పిల్‌వే నీటి వత్తిడికి కోతకు గురై మళ్లీ గుంతలుపడ్డాయి. ఎప్పటిలాగే స్పిల్‌వేపై పెద్దపెద్ద క్యావిటీ (గుంతలు)లు ఏర్పడ్డాయి. వాటి కి మరమ్మతులు చేసేందుకు టెండర్లు పిలిచి సంబంధిత సంస్థలకు పనులు అప్పగించాల్సి ఉంది. దీనిపై జనవరి 6న భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి స్పిల్‌వే మరమ్మతులు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశాలు జారీచేశారు.

శాశ్వత మరమ్మతులకు పలు సంస్థలతో సంప్రదింపులు

స్పిల్‌వే శాశ్వత ప్రాతిపదిక మరమ్మతులు చేసేందుకు అంతర్జాతీయ సంస్థలతో సాగునీటిశాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఇటీవలే రూర్కేలా ఐఐటీ వారు సర్వే నిర్వహించారు. వీరే కాకుండా మరో సంస్థ కూడా స్పిల్‌వేను సందర్శించింది. శాశ్వత మరమ్మతులు చేయడం సాధ్యం కాకున్నా.. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసేందుకు కనీసం శాశ్వత ఏర్పాట్లు చేయడానికైనా సలహాలు ఇవ్వాలని కోరారు. దీంతో స్పిల్‌వే దిగువ భాగాన కదిలే క్రేన్లను ఏర్పాటు చేసి దాని నుండి సులభంగా మరమ్మతులు చేసేందుకు క్యావిటీల కొలతలు తీసేందుకు వీలవుతుంది. అలాగే స్టీల్ రాడ్స్, కాంక్రీట్ పైకి పంపడానికి సులభమవుతుందనే అంచనాలకు వచ్చినట్లు సమాచారం. అందుకుగాను క్రేన్లను ఏర్పాటు చేసేందుకు అంచనాలు తయారీకి సంస్థల సంప్రదింపులకు టెండర్ల ఆహ్వానానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ పనులకు టెండర్లు

సాగర్‌డ్యాం ఎడమవైపు గల మెయిన్ కంట్రోల్‌ప్యానల్ ఎలక్ట్రికల్ పనులను నీటిపారుదల శాఖ సర్కిల్ నుంచి ఈ ప్రొక్యూర్‌మెంట్ టెండర్లకు ఈ నెల 3న ప్రకటన చేశారు. ప్యానల్‌బోర్డులు పాతవి తొలగించి కొత్తవి కేబుల్‌తో పాటు మరికొన్ని విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

నేటి నుంచి మొదలు కానున్న క్రస్ట్‌గేట్ల నిర్వహణ పనులు

ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలోనే జలాశయంలోని నీరు స్పిల్‌వే దిగువకు వెళ్లింది. దీంతో శనివారం నుంచి క్రస్ట్‌గేట్ల నిర్వహణ పనులు మొదలు పెట్టనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. డ్యాం సాధారణ నిర్వహణ పనులకుగాను రూ.40లక్షలు ఖర్చవుతాయని అంచనాలను పంపినట్లు తెలిపారు. గ్యాలరీలలోని నీటిని పంప్‌చేయడంతో పాటు చిన్నచిన్న పనులు చేయడం, సీసీ కెమెరాల మెయింటెనెన్స్, కుడి, ఎడమ కాల్వల గేట్స్ నిర్వహణకు గ్రీజింగ్, రబ్బరు సీల్లు అమర్చడం, నట్‌బోల్ట్స్ బిగింపు తదితర పనులు చేస్తారు. అలాగే స్పిల్‌వే దిగువ భాగాన గల బకెట్ పోర్షన్‌లో నీటిని డీవాటరింగ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.